చినుకుపడితే.. అడుగేయలేం!

దారుణంగా పుంత మార్గాలు
- ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం
- గగ్గోలు పెడుతున్న ఆక్వారైతులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఉండిలో రోడ్డుపై నిలిచిన పోయిన నీరు

ఉండి: తమది రైతు ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పుకొన్న కూటమి ప్రభుత్వం సాగుదాల రాకపోకలకు అవసరమ్యే పుంత మార్గాల నిర్వహణ, అభివృద్ధిని గాలికొదిలేసింది. పలు సందర్భాల్లో వీటిని అభివృద్ధి చేస్తామంటూ ఆ పార్టీ నేతలు హామీలు గుప్పించినా అవి అమలుకు నోచుకోవడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా పుంత దారులు బురద కయ్యాల్లా మారి అడుగుతీసి అడుగేయలేని స్థితికి చేరాయి. దీంతో ఎరువులు, యంత్రాల తరలింపు, పంట ఉత్పత్తులను బయటకు తెచ్చేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. అధికశాతం ప్రాంతాల్లో ఈ మార్గాలు దయనీయంగా మారడంతో ప్రసుత ఖరీఫ్ పనులకు ఇబ్బందులు తప్పడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..ఉండి మండలంలోని శివారు గ్రామాలను కలిపేందుకు నిర్మాణం చేసిన రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. నియోజకవర్గ కేంద్రం ఉండిని కలుపుతూ శివారు గ్రామం అర్తమూరు దాని శివారు కవిటంపాకలను కలుపుతూ 2015లో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన పథకంలో రూ.3.99 కోట్లతో 7.85కి.మీ మేర నిర్మాణం చేశారు. అయితే అప్పటి నుంచి ఈ రోడ్డును ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఎన్నో ప్రమాదాలు, ఎన్నో ఇబ్బందుల కోర్చి ఉండి అర్తమూరు, కవిటంపాలక ప్రాంతాల ప్రజలు ప్రయాణాలు చేస్తున్నారు. వందలాది ఎకరాల్లో ఆక్వాచెరువులు ఈ రోడ్డును ఆనుకునే ఉన్నాయి. ఆక్వారైతులు చెరువు దగ్గరకు వెళ్లాలన్నా, రావాలన్నా సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. ఈ రోడ్డుపై ప్రయాణం చేసి ఎంతోమంది ఆక్వా రైతులు కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు సమాచారం. ముఖ్యంగా రైతులు, ప్రజలు పగటి పూట ప్రయాణమే ప్రమాదాలతో కూడుకున్నదైతే, రాత్రి వేళల్లో ఈ రోడ్డు మరింత భయంకరంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులు, ఆక్వా ఉత్పత్తులు ఉండికి చేర్చాలంటే భారీ వాహనాలు వచ్చేందుకు రోడ్డు అనుకూలంగా లేకపోవడంతో అధిక ఖర్చులు అవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందని స్థానికులు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల శివారు గ్రామం అయిన అర్తమూరు దాని శివారు కవిటంపాకల ప్రాంతాల్లో ఎవ్వరికి అనారోగ్యం కలిగినా ఈ రోడ్డు ద్వారా వస్తే సుమారు 2.కి.మీ మాత్రమే ప్రయాణిస్తే ఉండి పాథమిక ఆరోగ్యకేంద్రానికి చేరుకుంటారు. అయితే రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ద్విచక్రవాహనాలు తప్ప కనీసం ఆటో వచ్చేందుకు కూడా అవకాశం లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమీప గ్రామం చెరుకువాడ, కలిసిపూడి, ఉండి గ్రామాల మీదుగా ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకోవాలంటే కనీసం సుమారు 9 కి.మీ ప్రయాణించాల్సి వస్తుందంటూ ప్రజలు వాపోతున్నారు. గతంలో కవిటంపాకల నుంచి ఎంతో మంది విద్యార్థులు సమీపంలో ఉండే జడ్పీ హైస్కూల్‌కు వచ్చేవారు. కానీ ఇప్పుడు రహదారి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు స్కూల్స్ బాటపడుతున్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కవిటంపాకల ప్రాంతంలో నివాసముండే వారికి తీవ్ర ఇబ్బందికరంగా మారుతుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అలాగే కి.మీ.దూరంలో ఉండే ప్రధాన గ్రామం అర్తమూరు నుంచి ఉండికి చేరుకోవాలంటే ప్రజలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీనిపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





అత్యంత అధ్వానంగా ఉండి అర్తమూరు, కవిటంపాకల ఆర్అండ్‌బీ రోడ్డు

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ సమావేశాన్ని విజయవంతం చేయండి



జల్లా కొండయ్య

భీమవరం అర్బన్: భీమవరం పట్టణంలో జువ్వల పాలెం రోడ్డులోని ఆనంద ఇన్ ఫంక్షన్ హాల్లో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జల్లా కొండయ్య గురువారం కోరారు. మధ్యాహ్నం 2.30 జరిగే ఈ సమావేశానికి ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జనరేటర్ బ్యాటరీల దొంగతనం

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామంలో గత నెల 5వ తేదీన జనరేటర్ బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయినట్లు జనరేటర్ యజమాని షేక్ అక్బర్ ఆలీ గురువారం ఫిర్యాదు చేసినట్లుహెడ్ కానిస్టేబుల్ డీవీ.రమణ చెప్పారు.చిలకలూరు పేట మండలం పోతవరం గ్రామానికి చెందిన అక్బర్ ఆలీ కుప్పనపూడి గ్రామంలో నివాసం ఉంటూ చెరువులకు జనరేటర్లు అద్దెకు ఇస్తున్నారని, గత నెల 5వ తేదీన గ్రామంలోని ఖాళీ ప్రదేశంలో జనరేటర్ ఉంచి తెల్లవారిన తరువాత చూసే సరికి జనరేటర్‌లో నాలుగు బ్యాటరీలు దొంగిలించుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెప్పారు.గత కొన్ని రోజులుగా వాటి గురించి ఆరా తీయగా ఎక్కడా లభించకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు.కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు వివరించారు.

జీవాల్ని రక్షించుకోవాలి



అయిభీమవరంలో నట్టల మందు వేస్తున్న పశువైద్యాధికారిణి కెల్లా భార్గవీ సత్య

ఆకివీడు: గొర్రెలు, మేకలలో వచ్చే వ్యాధుల్ని ఎప్పటికప్పుడు గుర్తించి మందులు వాడటం, ముందుజాగ్రత్త మందులు వాడటం ద్వారా పరిరక్షించుకోవచ్చునని మండల పశుసంవర్థక శాఖ అధికారిణి కెల్లా భార్గవీ సత్య చెప్పారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలో గురువారం నట్టల మందును గొర్రెలు, మేకలకు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగాలు లేని జీవాల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని చెప్పారు. నట్టల మందు వేయడం ద్వారా రోగాల బారిన పడకుండా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా 100 మేకలు, గొర్రెలకు నట్టల మందు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్థక సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మెకానిక్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: మోటార్ సైకిల్స్ మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తెల్లరేషన్ కార్డు కలిగిన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గురువారం భీమవరం మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మెకానిక్స్‌డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికశాఖ జిల్లా ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ అకన లక్ష్మి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వయసు కలిగినవారిని పనిలో పెట్టుకుంటే బాలకార్మిక చట్టం కింద నేరమన్నారు. మెకానిక్స్ ఎన్నో సంక్షేమ పథకాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బందెల హనుమంత్, ముమ్మన విజయ్ కుమార్, కోశాధికారి బురిడి సత్య వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల హక్కుల సాధనకోసం చేపట్టిన దశల వారి ఆందోళనల్లో భాగంగా గురువారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అపరిష్కృత డిమాండ్స్ నెరవేర్చాలన్నారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీలాపు చిత్తరంజన్, నీలాపు శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: మండలంలోని కోలమూరు, యండగండి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరికే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎన్ వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కోలమూరు సబ్‌స్టేషన్ పరిధిలో కోలమూరు, పాములపర్రు, ఉప్పులూరు, పాందువ్వ, కలిగిట్ల, ఆరేడు గ్రామాలతో పాటు యండగండి సబ్‌స్టేషన్ పరిధిలోని యండగండి, ఉణుదుర్రు గ్రామాలోని గృహావసరాలతో పాటు ఆక్వా చెరువులు, పరిశ్రమలకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆకివీడు: మండలంలోని ఆకివీడు విద్యుత్ ఉప కేంద్రం, చినకాపవరం సబ్ స్టేషన్‌పరిధిలో మొక్కల పలవులు తొలగింపు, లైన్ల క్లీరెన్స్ కార్యక్రమం చేపట్టడం వల్ల 4వ తేదీన విద్యుత్ సరఫరా మధ్యాహ్నం వరకూ నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకివీడు ఇండస్ట్రీయల్, ధర్మాపుర అగ్రహారం, దుంపగడప, చినకాపవరం, పెదకాపవరం, గొల్లగూడెం, క్షత్రియపురం, కోళ్లపర్రు, గుమ్ములూరు, తరటావ, ఆరేడు, కలిగొట్ల, పాములపర్రు, గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వాటర్ బాటిల్స్ పంపిణీ

వీరవాసరం: స్థానిక ఎంఆర్‌కే జెడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బోను దుర్గాప్రసాద్ తండ్రి యరయ్య వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని 130 మంది విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందజేశారు. హెచ్ఎం జుత్తిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మురుగు వసతి ఉన్న భూములకే అనుమతులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీపీఎం జ్ఞానకుమార్

కాళ్ల: గ్రామాల్లో మురుగు వసతి ఉన్న భూములకే చెరువులు తవ్వుకోవటానికి అనుమతులు ఇస్తామని మత్స్య శాఖ అధికారి ఎం.ఇందిరా ప్రియదర్శిని, డీపీఎం జి.జ్ఞానకుమార్ తెలిపారు. కాళ్ల మండలం జక్కరం, కాళ్ళ గ్రామాల్లో ఆక్వా జోన్ ఏర్పాటుపై గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఆక్వా జోన్లో లేని సర్వే నెంబర్లకు ఎటువంటి అనుమతులు ఇవ్వడం జరగదని స్పష్టం చేశారు. తమ పంట పొలాలకు మురుగు వెళ్లేందుకు బోదెలు ఉండి చెరువులు తవ్వుకోవటానికి అనుకూలంగా ఉన్న భూములను మాత్రమే ఆక్వా జోన్లో పెడుతున్నామని ఆమె తెలిపారు. సంబంధిత సర్వే నెంబర్ల జాబితా పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో పెడుతున్నామని, వీటిపై ఎవరికైనా అభ్యంతరాలు, అనుమానాలు, సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని కోరారు. అదేవిధంగా ఆక్వా చెరువుల నుంచి వ్యర్థ జలాలను నేరుగా పంట కాలువలోకి వదిలితే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ, జక్కరం, బొండాడ గ్రామ సర్పంచ్‌లు బందా విజయ, కూచంపూడి పద్మావతి, మన్నే వరలక్ష్మి, విఏఓలు జ్యోతి, రాజబాబు, పంచాయతీ కార్యదర్శిలు, రైతులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ద్వారా సేవలు విస్తరిస్తాం



ఉండి లయన్స్ క్లబ్ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

ఉండి: లయన్స్ క్లబ్ ద్వారా సేవలు మరింత విస్తారిస్తామని మండల కమిటీ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, ద్వారంపూడి నారాయణరెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఉండి లయన్స్ ఆడిటోరియంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. అతిథులు లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్‌లు ఈపూరి సత్యనారాయణ, డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు, రెండవ జిల్లా ఉప గవర్నర్ ఆర్వీఎస్ సూర్యనారాయణరాజు నూతన కమిటీతో అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు ముదునూరి శివరామరాజు,పెన్మత్స రంగ ప్రసాదరాజు, పీవీ జగన్నాధరాజు, కలిదిండి సీతారామరాజు, ముదునూరి విజయ, బొండాడ కేశవ రావు, జీవీ సూర్యనారాయణ, రుద్రరాజు నరసరాజు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా మండలంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ అనే సేవాసంస్థ ద్వారా ఎంతో మది మేలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మరెడ్డి, ముదునూరి శివరామరాజు, పాలతీర్థపు నర్సింగ రావు, కన్నెగంటి రూత్‌కళ, గాదిరాజు వెంకటేశ్వర రాజు, గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామ రాజు, వేగేశ్న అనంతలక్ష్మీ, ముదునూరి విజయ, బొండాడ కేవవరావు, రుద్రరాజు నరసరాజు,సుబ్బరాజు, హరనాధరాజు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించాలి



ఉండిలో ర్యాలీ నిర్వహిస్తున్న మెకానిక్స్

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం మెకానిక్స్ సమస్యలను పరిష్కరించాలని ఉండి మండల మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బొర్రా ఉమామహేశ్వరరావు, ఆకుల గోపాలకృష్ణ కోరారు. ప్రపంచ మెకానిక్స్ డేను పురస్కరించుకుని గురువారం ఉండిలో మండల మెకానిక్స్ యూనియన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర టూవీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్స్ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసామని తెలిపారు. రాష్ట్రంలోని టూవీలర్ మెకానిక్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపునివ్వాలని కోరారు.అలాగే మెకానిక్స్ వెల్ఫేర్‌బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ముంగండ శ్రీనివాసరావు,గుల్ల అప్పన్న ,కార్యదర్శి ఆరేపల్లి రాజు,కట్టా విఘ్నేశ్వరరావు,తోట పవన్,పూరెళ్ళ రాంబాబు,బైరెడ్డి తరుణ్‌కుమార్, కోండ్రోతు సత్యనారాయణ తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

భీమవరం: గిరిజన ప్రాంతాల్లో మహోద్యమం నడిపించి ఆదివాసుల హక్కులకు, దేశ స్వతంత్ర కోసం అల్లూరి సీతారామరాజు వీరోచితమైన పోరాటం చేశారని ఎమ్మెల్సీలు బొర్రా గోపీమూర్తి అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి గణేష్ అధ్యక్షతన జరిగిన సీతారామరాజు 128వ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అల్లూరి పోరాట స్ఫూర్తిని నేటి తరం యువత ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ అల్లూరి, భగత్ సింగ్ వంటివారు సమ సమాజం స్థాపించాలని, అసమానతలు లేని సమాజమే తమ లక్ష్యంగా తమ జీవితాలను అర్పించారన్నారు. విద్యార్థులు కుల, మత విభేదాలు, ఆర్థిక అసమానతలు, దోపిడీలేని సమాజం కోసం పోరాడడమే అల్లూరికి మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ వాణిశ్రీ, ఎస్ఎఫ్ఐ పూర్వపు జిల్లా అధ్యక్షుడు కె సూర్య, యూటిఎఫ్ పూర్వపు జిల్లా కన్వీనర్ శ్రీనివాసరాజు జిల్లా కార్యదర్శి టి ప్రసాద్, ఎస్ లక్ష్మణ్, కె గోవింద్, కె రోహిత్ పి సాయికృష్ణ, కె హేమంత్ పాల్గొన్నారు.

అల్లూరి సహస గాధలు భావితరాలకు చెప్పాలి

భీమవరం: అల్లూరి జయంతోత్సవాలను పురస్కరించికుని సహస గాధలను భావితరాలకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు అన్నారు. విప్లవవీరుడు అల్లూరి జయంతోత్సవాల్లో భాగంగా శ్రీవిజ్ఞానవేదిక, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో అల్లూరి విద్యాభ్యాసం చేసిన లూథరన్ హైస్కూల్, ఎస్‌సీహెచ్ బీఆర్ఎం హైస్కూల్, కొవ్వాడ జెడ్పీ హైస్కూల్స్ వద్ద ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అల్లూరి బాల్యం, విద్య అనేక ప్రాంతాల్లో గడిచిందని ఆయా పాఠశాలల్లో అల్లూరి స్మృతులతో జయంతోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులకు అల్లూరి ఆశయాలు నెరవేరుద్దాం అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మహారాజ్, పాతబళ్ల రంగవల్లి, బి శ్రీనివాసరావు, కూనపరాజు రామకృష్ణంరాజు, అల్లూరి సాయి దుర్గారాజు, కొండయ్య, ఎం సామ్యూల్ రాజు, సిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపును ఆపండి



స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అజ్జమూరు కాల్వ గట్టు ఆక్రమణ దారులు

ఆకివీడు: ఆక్రమణల తొలగింపును నిలుపుదల చేసి, బాధితులకు పట్టాభూములు ఇవ్వాలని మండలంలోని అజ్జమూరు గ్రామంలోని కాల్వ గట్టు ఆక్రమణదారులు మొరపెట్టుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధిత మహిళలు మాట్లాడుతూ గత 40,50 ఏళ్లుగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని, తమకు ఏ దిక్కూలేదని వాపోయారు. రెక్కాడితే గాని డొక్కాడని తమ బ్రతుకులపై ఈ విధమైన చర్యలు తీసుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు. రెక్కల కష్టంపై కట్టుకున్న ఇళ్లను కూల్చివేయాలనుకోవడం సమంజసం కాదని వాపోయారు. ప్రభుత్వం తమకు పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించుకునేందుకు రుణ సదుపాయం కల్పిస్తే ఇక్కడ నుంచి వెళ్లిపోతామని వారు తెలిపారు. కార్యక్రమానికి సీపీఎం నాయకులు పెంకి అప్పారావు, బీ.రాంబాబు, రామచంద్రమూర్తి, పానకాలరావు, సుబ్రహ్మణ్యం, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకాన్ని నిషేధించండి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత

ఆకివీడు: ప్రపంచం ప్లాస్టిక్ మయమైపోతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో ప్రపంచం సతమతమైపోతుందని వాపోయారు. వాడి పారవేసే బ్యాగ్‌ల వాడకాన్ని తగ్గించడం, నిషేధించడం ద్వారా సమస్యను కొంత వరకూ అరికట్టవచ్చునన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై పారవేయడం వల్ల ఆవులు, మేకలు, ఇతర జంతువులు వాటిని తిని అస్వస్థతకు గురవుతున్నాయన్నారు. ప్లాస్టిక్ భూమిలో ఉండిపోయి, నిర్వీర్యం అవ్వకుండా ఏళ్లతరబడి ఉండటంతో భూమిలో పలు రకాల కీటకాలకు ప్రమాదం ఏర్పడుతోందన్నారు. అవి అంతరించిపోవడం వల్ల భూసమతౌల్యం దెబ్బతింటుందని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రసాయినిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఇందిర మాట్లాడుతూ ప్లాస్టిక్ బదులు గోనెసంచుల బ్యాగ్‌లు ఉపయోగించాలని కోరారు. భూమిపై అన్ని జీవరాసులు మనుగడ సాధించాలంటే ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడాలన్నారు. విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ద్వారా స్ఫూర్తి పొందాలి



భీమవరం ఆర్ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న అరవిందస్వామి

భీమవరం: యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమం ద్వారా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు స్ఫూర్తి పొందాలని భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి పి అరవిందస్వామి అన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ముందుగా ఈ పోర్టల్‌లో నమోదు చేసుకొని నూతన ఆవిష్కరణలు, ఆలోచనలను దాంట్లో అప్లోడ్ చేయాలన్నారు. మెరుగైన వాటికి నగదు పురస్కారాలు, ఆర్థిక సహాయం అందజేస్తారని ప్రభుత్వం యువతలో నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక నాయకత్వం వంటి సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ పోర్టల్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వికేజె ప్రసూన, కో ఆర్డినేటర్ ఎస్ లక్ష్మీకాంతం, అధ్యాపకులు కాకుమాని శ్రీనివాసరావు, ఎల్ నర్సింహారావు, జి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా సుదర్శన హోమం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో మావుళ్లమ్మ దేవస్థానంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఉచిత మహా సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, ఆలయ సిబ్బంది కలిసి ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. శుక్రవారం జరిగే మహా సుదర్శన హోమం కార్యక్రమంలో భక్తులు అందరు హాజరు కావాలని తద్వారా వారి కష్టాలు తొలగించుకుని శిరి సంపదలు పొందాలని ఆయన కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకొని భీమవరం అల్లూరి సీతారామరాజు స్మృతివనం వద్ద నిర్వహించనున్న కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించి సూచనలు అందించారు. అనంతరం భీమవరం పట్టణంలోని 32, 33, 34, వార్డుల్లో పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు. నీఆయన వెంట ఆర్డిఓ కె .ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తెలుగుకు వన్నెతెచ్చిన దివాకర్ల

ఉండి: తెలుగుబాషకు వన్నెతెచ్చిన సాహితీపుత్రుడు తిరుపతి వెంకట కవులలో ప్రముఖుడు దివాకర్ల వెంకటావధాని అని ప్రముఖ కవి, సహస్రావధాని కోట వెంకట లక్ష్మీ నరసింహ అన్నారు. దివాకర్ల సాహితీ సంస్థ అధ్యక్షుడు చెరుకువాడ అప్పల రామకృష్ణవర్మ ఆధ్వర్యంలో వెంకటావధాని 113వ జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దివాకర్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం దివాకర్ల వెంకటావధాని సాహితీ పురస్కారాన్ని కోట వెంకటలక్ష్మీనరసింహకు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఛామర్తి లక్ష్మణరావు, కోపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి చెరుకువాడ రవికుమార్, వేగేశ్న రామరాజు, రాంబాబు, దండు సూర్యనారాయణరాజు,కన్నా శివన్నారాయణ, తానుకిండ సూర్యచంద్రరావు, ఉద్దరాజు లక్ష్మీ, సీహెచ్ బంగారావు తదితరులు పాల్గొన్నారు.